# ఒకరికొకరు!

ఏ కథ సంపాదకుడికి నచ్చి అచ్చుకు నోచుకుంటుందో ఏ సినిమా వంద రోజులు ఆడి నిర్మాతకు కనక వర్షం కురిపిస్తుందో... ఏ ఆడపిల్ల మగపిల్లవాడికి నచ్చి సంబంధం ఖాయం అవుతుందో.... కరెంట్ ఎప్పుడు పోతుందో... సునామీ ఎప్పుడొస్తుందో ఎవరూ చెప్పలేరు.

నామటుక్కునాకు చూపులప్పుడు సుందరిని చూడగానే ఎందుకో... ఆమెనే చేసుకో వాలన్పించింది. ఆన్సర్ పేపర్స్ స్పాట్ వేల్యుఏషన్లోలాగ నా అభిప్రాయం అప్పటికప్పుడు స్పాట్లో చెప్పాను. పిల్లతండ్రి ఎగిరి గంతేసాడు. పైసా కూడా కట్నం పుచ్చుకోనన్నాను. రెండవసారి ఎగిరి గంతేసాడు పిల్లతండ్రి.

నామటలకి సుందరి సంబరపడింది. అక్కడి బంధువర్గం ఆడంగులు అంతా ఆశ్చర్యపోయి ముక్కున వేలేసుకున్నారు. నా సుందరిని సోగళ్లుకావు. ఎర్రతోలుకాదు. అందమైన వాలు జడ లేదు. బొడ్డు కిందికి చీర కట్ట లేదు. రాంపుల మీద నడిచే సుందరీమణులకు మల్లె...సుందరి కేట్వాకులు చెయ్యలేదు. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి లాగ అద్భుతంగా పాట పాడలేదు. అయినా నాకు నచ్చింది.. నేను మెచ్చి ఇష్టపడింది సుందరినే!

డిగ్రీ చదవలేదు.ర్యాగింగ్ బారినపడలేదు. ఎవరికీ లవ్ లెటర్స్ వ్రాయలేదు. ఎవరితోనూ లవ్లో పడలేదు. క్లాసులు ఎగ్గొట్టి మ్యాట్నీ షోలకెళ్లలేదు.

చదువు మానేసి తల్లికి ఇంట్లో చేదోడు వాదోడుగా వుంది! వంట వార్పూ నేర్చుకుంది!

నా సుందరికి హృదయాన్ని మీటటం వచ్చు! కట్టుకున్న నన్ను బుట్టలో వేసుకోవటం వచ్చు! పిల్లల్ని కనటమూ వచ్చు అనుకున్నాను. కాని అదీ నా భ్రమేనని తెల్సుకున్నాను.

పెళ్లి చూపులప్పుడు ఆమెను చూసి జాలి పడ్లేదు. ముచ్చట పడ్డాను! చూపులప్పుడు నన్ను పక్కకు రమ్మని తనకు మూడోనెల అన్లేదు. నీతో పెళ్లి నా కొద్దని వలవలా ఏడవలేదు. నా కాళ్లమీద పడ్లేదు-నేను నీ కెందుకు నచ్చిచచ్చాన్రో చచ్చినోడాని శాపనార్థాలు పెట్టలేదు.

అందుకే సుందరి నాకు శానా బోలెడు నచ్చేసింది. పెళ్లి చూపులప్పుడు చూడీదార్ వేసుకోలేదు. పట్టు పరికిణీ ఓణీ వేసుకున్నందుకు ముచ్చటేసింది. మెడనొప్పి పుట్టేట్టు తలొంచుకు కూర్చోలేదు. నిముషానికి అరవైసార్లు కళ్లార్పకుండా నన్నే చూస్తూన్నేవుంది. నాకీజన్మలో పెళ్లి అయ్యే యోగంలేదు. ఇప్పటికే బోలెడన్ని సంబంధాలు మావాళ్లు చూచి విసిగిపోయారు. కావున  మీరైనా నన్ను పెళ్లాడే సెయ్యండి మొర్రో అనే భావన సుందరి చూపుల్లో గోచరించలేదు.

ఒకరినొకరం కళ్లతోటే సంభాషించుకున్నాం. యస్సనుకున్నాం. అంతర్లీనగ నవ్వుకున్నాం. మూడో కంటికి అర్థంకాని మూగ భాషతో ముద్దులిచ్చి పుచ్చుకున్నాం.

పిల్లనల్లగావుందని అమ్మ...ముఖంలో కళాకాంతుల్లేవని మా డాడీ... అందమా చందమా నాజూకు తనమా...ఏమీ లేవని మా చెల్లెల్లు...వదినగారు అన్లేదు.

నేను అందగాడిననే అహం నాలో లేదు. అంత మాత్రం చేత పిల్ల'కాకి'లా వుంది కాబట్టి కట్నం రేటు పెంచండి అని అంటానేమోని సుందరి తరపువైపువారు భయపడి చావలేదు.

మాది మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ! పేరెంట్స్‌కి అత్యాశల్లేవు. డాడీ ఫింఛన్ లేని జాబుచేసి రిటైరైనాడు. మా అన్నయ్య మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టరు.

నేను కంప్యూటర్ ఇంజనీర్‌ని! సాలరీ నెలకి డెబ్బైవేలు! కంపెనీలో చేరిన ఆరు నెలలకే నన్ను అమెరికా పంపారు. అక్కడ రెండేళ్లుండి డాలర్లు మూటగట్టుకొచ్చాను.

ఆ డబ్బుతో నాకు నచ్చే స్టైల్లో ఇల్లు కట్టించాను. కారు కొన్నాను. సుందరినే భార్యగా కోరుకున్నాను.

నాక్కాబోయే లైఫ్ పార్ట్నర్ గురించి కలల లోకంలో విహరించలేదు. ఐశ్వర్యారాయ్ వంటి అందగత్తె కావాలని కోరుకోలేదు. అపరంజి బొమ్మ... అజంతా శిల్పసుందరిలా వుండాలను కోలేదు.

అమ్మాయి సీదా సాదాగ... సింపుల్‌గా...'హోమ్లీ'గ 'లవ్లీ'గా వుంటే చాలనుకున్నాను.

నేను ఆశించినవన్నీ సుందరిలో చూడగలిగాను.

కాకపోతే.... జీన్స్ డ్రెస్...హై హీల్ షూతో వుండే అమ్మాయి మాత్రం నాకొద్దు భగవంతుడాని దేవుడిని మనసులో ప్రార్థించేవాడిని. ఆడ్రెస్ వేసుకునే లేడీస్ అంటే నాకు బొత్తిగా ఇష్టముండదు. ఎందుకో నా మనసుకి నచ్చదు. అలాంటి వారికి తగిన మొగుళ్లు సపరేట్‌గా వుంటారేమో. నేను అలాంటి వారి 'లిస్ట్'లో మాత్రం లేను.

సింప్లిసిటీ అంటే నాకెంతో ఇష్టం! అంగాంగ ప్రదర్శనలిచ్చే ఆడపిల్లలకి నేను ఆమడదూరం!

ఆఫీసు నుంచి ఇంటికి రాగానే చిరునవ్వుతో స్వాగతం పలికే భార్య ఐతేచాలు. ఆమె ఒడిలో నా తల పెట్టుకుని సేద తీర్చగల సైకాలజీ వున్న స్త్రీ కావాలన్నదేనా విష్!

నేను కోరుకున్న క్వాలిటీస్ అన్నీ నా సుందరిలో చూడగలిగాను.హేట్సాఫ్ టు హర్!

ఈ జన్మకి మేము ఒకరికొకరం..

ఇదిచాలు...

★★★★★

మా దాంపత్యం ఎందరికో ఆదర్శం! మా జంట మేడ్ ఫర్ ఈచదర్! మా మనసుల్లో

మధురానుభూతులెన్నో... ఎన్నెన్నో.

ఆనందంగ గడిచిపోతున్న రోజుల్లో కష్టాల సునామీ విరుచుకుపడింది.

ఆఫీసులో వర్క్ చేసుకుంటున్న నాకు ఫోన్‌కాల్ వచ్చింది. నా సుందరి యాక్సిడెంట్‌కు గురైందట. కార్పొరేట్ హాస్పిటల్ లో అడ్మిట్ అయిందట... నా గుండె ఆగినట్టన్పించింది.

ఈ వార్త నిజమా?..కాదా?

కారుడ్రైవ్ చేసుకుంటూ...ట్రాఫిక్ జామ్‌ని అర్జునుడిగా ఛేదిస్తూ... హాస్పిటల్ చేరుకున్నాను.

కారు పార్క్ చేసి లాక్ చేసి ఎమర్జన్సీ వార్డు వేపు వడి వడిగ నడిచాను. ఎంక్వయిరీలో విచారించాను. ఐ.సి.యు. లో వుందని తెలీగానే గుండె బేజారైంది.

బెడ్‌మీద సుందరి.. చుట్టూ డాక్టర్లు... ముఖానికి ఆక్సిజన్ మాస్క్...పక్కనే పోలీసు ఇన్స్పెక్టరు అవుపించారు.

సుందరికి ఏక్సిడెంట్ జరగట మేమిటి? - అసలు ఎలా జరిగిందో వివరాలు తెలుసుకోవాలనే ఆతృత నన్ను కుదిపేస్తోంది.

ఇన్స్పెక్టర్ పలుకరించి 'సో అండ్ సో' అని చెప్పాను.

లేడీస్ ఎంట్రన్స్ వేపు నుండి సిటీ బస్ దిగుతూండగ చూడని డ్రైవర్ స్టార్ట్‌చేశాడట... మీ మిసెస్ కింద పడిపోయారు. బస్సు బేక్‌టైర్ ఆమె రెండు కాళ్ల మీదుగా వెళ్లిపోయిందని చూచిన ప్రత్యక్ష సాక్షులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. పోలీస్ స్టేషన్ ఆక్సిడెంట్‌స్పాట్‌కి దగ్గర్లోనే వుండటాన మాకు మేసేజ్ వచ్చింది. - దగ్గర్లో వున్న ఈ ప్రైవేట్ హాస్పిటల్ నుండి అంబులెన్స్ తెప్పించి జాయిన్‌చేసాం. ఈమె స్పృహలో లేదు. బట్ షి విల్ బి ఆల్‌రైట్...లైఫ్ డేంజర్ లేదని డాక్టర్లు చెప్పారు.... జరిగిన దాన్ని క్లుప్తంగా వివరించాడు ఎస్పై.

నా కళ్లు చెమర్చాయి! ఏ దేవుడికి మా అన్యోన్యత చూచి కన్నుకుట్టింది? - లేకపోతే ఈ దారుణం ఏమిటి?

వెంటనే అర్థోపెడిక్ సర్జన్‌ని కన్సల్ట్ చేసాను. ఎంత డబ్బు ఖర్చయినా పరవాలేదు..బెస్ట్ ట్రీట్‌మెంట్ ఇమ్మని వేడుకున్నాను.

మోకాళ్ల క్రింది భాగం పూర్తిగ క్రష్ అయినందువల్ల ఆపరేషన్ చేసి పూర్తిగా తొలగించాలన్నాడు సర్జన్.

అంటే....? నా సుందరి కుంటిదౌతుందా? - తనకు రెండు కాళ్లు లేవని తెల్సుకున్న క్షణాన ఆమె బ్రతగ్గలదా?... సుందరిని ఓదార్చటం.... తిరిగి మామూలు మనిషిగా ఆమెను చేయటం నా వల్ల అవుతుందా?

హే భగవాన్!.. ఎందుకయ్యా నా సుందరికి ఇంతటి కఠినమైన శిక్ష విధించావ్?-అదేం పాపం చేసిందని?

ఒక బస్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల నా సుందరి జీవితాంతం అవిటితనంతో బాధపడాల్సి రావటం... నిజంగా దారుణం!

సుందరికి సర్జరీ కోసం కౌంటర్లో క్రెడిట్ కార్డుతో లక్ష రూపాయలు డిపాజిట్ చేసాను.

వెంటనే! ఐ.సి.యు నుండి సుందరిని ఆపరేషన్ థియేటర్‌కి తరలించారు.

★★★★★

హాస్పిటల్లో వున్నన్నాళ్లూ బంధువులు రావటం పరామర్శించటంతో పుండుమీద కారం చల్లినట్టన్పించేది సుందరికి. మరచి పోదామని ప్రయత్నిస్తున్న దౌర్భాగ్యపు సంఘటన పదే పదే గుర్తు చేసుకోక తప్పేది కాదు. కళ్ల నీళ్ల పర్యంతమయ్యేది. నా ఓదార్పు మాటలు కొరగాకుండా పోయేవి.

ఇంటికొచ్చాక 'వీల్‌ఛైర్' తప్పనిసరైంది. నా సుందరి మూగగా రోదించటం చూస్తూ నా గుండె చెరువైపోయేది.

మళ్లీ పూర్వపు మధురక్షణాలు మా మధ్య ఉండవేమోని మధన పడుతూండటం నా గుండెని చీల్చినట్టన్పించేది.

నా సుందరిలో గల అసంతృప్తిని ఆవేదనను దూరం చేయాలనేదే నా అభిమతం! ఆమె నిర్వేదంగ నవ్వినప్పుడు... బేలగ నాకళ్లల్లోకి చూచినప్పుడు... నాగుండె రంపపుకోతకు గురయ్యేది.

ధైర్యాన్ని... ఆత్మ స్థైర్యాన్ని నూరి పోసాను.

చేతులతో ఎత్తుకుని ఆమెను 'వీల్ చైర్లో కూర్చోబెడుతున్నప్పుడు... ఛైర్లో నుంచి బెడ్ మీద పడుకోపెడుతున్నప్పుడు... నా భార్య కళ్లల్లో అగుపించే కృతజ్ఞతా భావం నన్ను కుదిపేసేది.

అంతలోనే మల్లెతీగెలా నన్ను చుట్టుకుపోయి భోరున ఏడ్చేది. దాని వీపు నిమురుతూ సముదాయించేవాడిని!

చూడు సుందరీ! ....నువ్వు...నేను... వేరు వేరు వ్యక్తులమే అయినా ఒకరికొకరం జీవిస్తున్న వాళ్లం! నాకీ దుస్థితే వస్తే నువ్ నన్ను ఆదుకోకుండా వుండగలిగేదానివా?.. అన్నప్పుడు సుందరి నా చెవిలో మీలో దేవుడిని చూస్తున్నాను..అంది.

ఆతృప్తే...మాలో ఇప్పటికీ మధురానుభూతులను మిగులుస్తోంది. మమ్మల్ని ధైర్యంగా ముందుకు నడిపిస్తోంది.

ఒకరినొకరు ప్రేమించుకోవటమే జీవిత లక్ష్యం!! ఇద్దరూ ఒక్కరై బ్రతకటంలోనే ఎంతో హాయి తృప్తి వుంది వుంటుంది!!

-:(సమాప్తం):-